E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

07-04-2025 సోమవారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



2లో

అరుదైన వ్యాధి ఔషధాన్ని దేశంలో తక్కువ ధరకే అందించగలరా?

## హెచ్‌సీయూ వివాదం.. కేటీఆర్ బహిరంగ లేఖ



**ఈ కబురు, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి, హెచ్‌సీయూ రక్షణకు చేతులు కలపాలంటూ తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, పర్యావరణ ప్రియులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. హెచ్‌సీయూ భూముల వివాదం నేపథ్యంలో రేవంత్ సర్కార్ తీరును లేఖలో ఎండగట్టారు. 400 ఎకరాల పర్యావరణం ప్రమాదంలో పడింది. 734 జాతుల మొక్కలు, 220 పక్షులు, 15 సరీసృపాలు, 10 క్షీరదాల ఆవాసం నాశనం కాకుండా ఆపుదాం అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

"ప్రభుత్వం ఆర్థిక లాభం కోసం పర్యావరణంపై దాడి చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణం నాశనం చేసే ప్రణాళికలు కొనసాగిస్తోంది. విద్యార్థుల నిరసనకు సలాం. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు శాంతియుతంగా అడవి రక్షణకు పోరాడుతున్నారు. విద్యార్థులపై అపవాదులు, యూనివర్సిటీని తరలించే బెదిరింపులు ప్రభుత్వ రియల్ ఎస్టేట్ మనస్తత్వానికి నిదర్శనం" అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

ఎకో పార్క్ పేరుతో సరికొత్త మోసం. అడవిని కాపాడే బదులు భూమి ఆక్రమణకు ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. నిరసనలు కొనసాగితే హెచ్‌సీయూని "ఫోర్త్ సిటీ"కి తరలిస్తామని హెచ్చరిక తప్పు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు మద్దతుగా నిలవాలి. కంచ గచ్చిబౌలి, యూనివర్సిటీని కాపాడుతామని పార్టీ నుంచి హామీ హామీ ఇస్తున్నాము. సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించి, భూమి విక్రయాన్ని రద్దు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సామాన్యుడి ఇంట్లో సీఎం భోజనం..



- కొత్తగూడెం జిల్లా సారపాకలో పర్యటించిన సీఎం
- సన్నబియ్యం లబ్ధిదారులతో మాటాముచ్చట
- లబ్ధిదారుడు భూరం శ్రీనివాసరావు ఇంట్లో భోజనం
- త్వరలో 10 లక్షల రేషన్ కార్డులు
- సన్నబియ్యం పండిస్తే బోనస్‌సీఎం రేవంత్

**భద్రాది కొత్తగూడెం:** జిల్లాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో ఆయన పర్యటించారు.అక్కడ సన్న బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు సీఎం రేవంత్ రెడ్డి.ఈ మేరకు లబ్ధిదారుడు భూరం శ్రీనివాసరావు కుటుంబ కష్టసుఖాల గురించి సీఎం రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఇక ఉదయం భద్రాచలంలో నిర్వహించిన సీతా రాముల కల్యాణోత్సవానికి హాజరైన సీఎం స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. అక్కడి సన్న బియ్యం లబ్ధిదారుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. అలాగే సీఎం వెంట వెళ్లిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు కూడా అక్కడే సీఎంతో కలిసి భోజనం చేశారు. ముందుగా రేవంత్ రెడ్డికి స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఇంట్లోకి తరువాయి 2లో



2లో

భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుకలు.. పట్టు వస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్ రెడ్డి



'సంతకమైనా తమిళంలో చేయండి' నేతల తీరుపై మోదీ ఆశ్చర్యం

2లో



'రాజా బాబు' ఓటమిని భరించ లేకపోతున్నారు కంగనా రనౌత్



ఇప్పుడు ముస్లింలు.. తర్వాత ఇతరులు



## పాంబన్ వంతెన ప్రారంభం..

### జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**పాంబన్ వంతెన ను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.**

**ఈ కబురు:** భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెన ను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన ఇది. సముద్రంలో 2.08 కి.మీ. పొడవు ఉండే ఈ వంతెన దిగువన ఓడల రాకపోకలకు వీలుగా కీలకమైన వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రూ.535 కోట్లతో దీన్ని నిర్మించారు. 2019 మార్చి 1న ప్రధాని మోదీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పనులు చేపట్టి, నాలుగేళ్లలో పూర్తిచేసింది. ఈ క్రమంలోనే రామేశ్వరం తాంబరం ప్రత్యేక రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇది కొత్త వంతెన మీదుగా పరుగులు తీసింది. రైల్లో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు సందడి చేశారు. అదేవిధంగా వంతెన కిందుగా ప్రయాణించిన కోస్ట్ గార్డ్ నౌకకూ పచ్చ జెండా ఊపారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, తమిళనాడు ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ రూ.8,300 కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభించనున్నారు. తర్వాత రామేశ్వర ఆలయాన్ని సందర్శించి జ్యోతిర్లింగాల వద్ద పూజలు నిర్వహిస్తారు.





## బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతా: ఉత్తమ్

**కృష్ణా, గోదావరి జలాలపై విచారణకు బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**

**ఈ కబురు,హైదరాబాద్:** కృష్ణా, గోదావరి జలాలపై విచారణకు బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై న్యాయవాదులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ ఆదివారం చర్చలు జరిపారు. కృష్ణా జలాల వివాదాలపై వాదనలు వినిపిస్తున్న న్యాయబృందంతో చర్చించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న విచారణ అంశాలపై ఆరా తీశారు. వాదనలు వినిపిస్తున్న న్యాయ బృందానికి పూర్తి సహకారం ఇస్తామన్న ఆయన.. వక్రీకృత నీటి కేటాయింపుల వల్ల తెలంగాణ ప్రజలు నష్టపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోబోమని తేల్చి చెప్పారు.



2లో

పోలీసు నియామకాల్లో అగ్నివీరులకు 20% రిజర్వేషన్లు.. ఏ రాష్ట్రంలోనంటే!



## కొండాపూర్ లో నడిరోడ్డుపై దారుణం...

గర్భవతిగా ఉన్న భార్య మీద భర్త కర్కశత్వం

బండరాయితో మోది భార్యపై హత్యాయత్నం

ప్రాణాలతో పోరాడుతున్న గృహిణి

3లో



కంచె గచ్చిబౌలి వివాదంపై మీనాక్షి నటరాజన్ ఫోకస్

ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు.. క్లారిటీ ఇచ్చిన ధోనీ

6లో





2లో

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

# సామాన్యుడి ఇంట్లో
# సీఎం భోజనం..

మొదటి పేజి తరువాయి

ఆహ్వానించారు. అనంతరం సదరు కుటుంబంతో కలిసి భోజనం చేశారు సీఎం. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు.దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు తీసుకునేందుకు ఆసక్తి చూపేవాళ్లం కాదని, ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండడంతో కుటుంబానికి ఉపయోగకరంగా ఉందని సీఎం ఎదుట శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారితో ఫొటోలు దిగిన రేవంత్ రెడ్డి అక్కడ్నుంచి వెళ్లిపోయారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, అభిమానులు పెద్దఎత్తున సారపాక గ్రామానికి చేరుకున్నారు. తమ అభిమాన నేతను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్చి 30న ప్రారంభించిన విషయం తెలిసిందే. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ లో ఏర్పాటు చేసిన సభలో ఈ స్కీంను ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభవుతుందని సీఎస్ శాంతి కుమారి తెలిపిన విషయం విదితమే. అలాగే దాదాపు 10 లక్షల కొత్త రేషన్‌కార్డులు జారీ కానున్నాయని ఆమె పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని చెప్పారు. ధనవంతుల లాగే పేదవారు కూడా సన్నబియ్యం తినాలని కోరుతున్నారని చెప్పారు. గత ఏడాది 1.56 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కువగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ ఉందని.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత భారీగా వరి ఉత్పత్తి జరగలేదని చెప్పుకొచ్చారు. సన్న బియ్యం పండిస్తే బోనస్ కూడా అందిస్తున్నామని తెలిపారు.

# 'సంతకమైనా తమిళంలో చేయండి' నేతల తీరుపై మోదీ ఆశ్చర్యం

**వైద్య విద్యను తమిళ భాషలో అందించాలని.. తద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని డీఎంకే ప్రభుత్వానికి ప్రధాని మోదీ సూచించారు.**



**ఈ కబురు:** తమిళనాడుకు కేంద్రం నిధులు పెంచినప్పటికీ.. కొందరు నిరాశే వ్యక్తం చేస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టుల కోసం గతంలో కంటే ఏడు రెట్లు నిధులు పెంచామన్నారు. 2014 వరకు రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.900 కోట్లు కేటాయిస్తే.. ఎన్డీఏ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ. 600కోట్లు కేటాయించిందన్నారు. రామేశ్వరంలోని పాంబన్ బ్రిడ్జ్ ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన.. డీఎంకే ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

వైద్య విద్యను తమిళ భాషలో అందించాలని.. తద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని మోదీ సూచించారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచ నలుమూలలా విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొందరు నేతలు సంతకాలను తమిళంలో చేయకపోవడం పట్ల ప్రధాని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కనీసం వాటినైనా తమిళంలో చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఇంజినీరింగ్ అద్భుతం**

21వ శతాబ్దంలో నిర్మించిన ఇంజినీరింగ్ అద్భుతం 'పాంబన్ వంతెన' అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ వంతెన ఆధునికీకరణ డిమాండ్ దశాబ్దాల నుంచి ఉందన్నారు. ప్రజలకు రవాణా పరంగానే కాకుండా ఉపాధి, ఆదాయవృద్ధికి కూడా ఇదెంతో ఉపయోగపడనుందని చెప్పారు.

"మా ప్రభుత్వం దేశానికే గర్వకారణంగా నిలిచే మూడు వంతెనలు నిర్మించింది. ముంబయిలో సముద్ర వంతెన, జమ్మూకశ్మీర్‌లో చినాబ్ వంతెన, పాంబన్ వంతెనలు అద్భుతమైనవి. ప్రపంచంలో అత్యంత ఎత్తైన వంతెనను చినాబ్ నదిపై.. దేశంలో అత్యంత పొడవైన సముద్రపు వంతెనను ముంబయిలో.. దక్షిణాదిలో రామేశ్వరం వద్ద వర్టికల్ రైల్వే వంతెనను నిర్మించాం. భారతరత్న అబ్దుల్ కలాం పుట్టిన గడ్డ రామేశ్వరం. టెక్నాలజీ, ఆధ్యాత్మికత కలగలిసిన పుణ్యభూమి" అని మోదీ పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో పురోగతి సాధించిందన్నారు.

# పోలీసు నియామకాల్లో అగ్నివీరులకు
# 20% రిజర్వేషన్లు.. ఏ రాష్ట్రంలోనంటే!

**రాష్ట్రంలో పోలీసు నియామకాల్లో అగ్నివీరులకు 20శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు నాయబ్ సింగ్ ప్రభుత్వం ప్రకటించింది.**

**ఈ కబురు:** అగ్నివీర్‌లకు సంబంధించి హరియాణా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తమ రాష్ట్రంలో పోలీసు నియామకాల్లో అగ్నివీరులకు 20శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. అగ్నివీరుల నమోదు కోసం ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ అధ్యక్షతన పంచకులలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి 202223లో 2,227 మంది, 2324లో 2,893 మంది ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో చేరారని గుర్తుచేశారు. త్రివిధ దళాల్లో సర్వీసు పూర్తిచేసుకున్న అగ్నివీరుల భవిష్యత్తును కాపాడేందుకు తమ రాష్ట్రం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. నియామకాల్లో వారికి 20శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, దేశంలో ఈ తరహా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా నిలిచిందన్నారు.

రాష్ట్రంలో చేపట్టే కానిస్టేబుళ్లు, ఫారెస్టు గార్డు, జైలు వార్డెన్ల నియామకాల్లో అగ్నివీర్‌లకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు భాజపా హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. హరియాణా అగ్నివీర్ పాలసీ 2024ను తీసుకువచ్చింది. తాజాగా 20శాతం మేర రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ప్రకటించింది. వీటితోపాటు స్వయం ఉపాధిని ఎంచుకునే వారికి అవసరమైన సబ్సిడీలను సైతం అందిస్తామని తెలిపింది.w

# 'రాజా బాబు' ఓటమిని
# భరించలేకపోతున్నారు కంగనా రనౌత్

**రాజా బాబు అయినందున గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని విక్రమాదిత్య సింగ్ భరించలేకపోతున్నారని కంగనా రనౌత్ విమర్శించారు.**



**ఈ కబురు:** హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్‌పై భాజపా ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజాబాబు అయినందునే ఆయన గత లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని భరించలేకపోతున్నారని విమర్శించారు. మండీలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ విక్రమాదిత్య సింగ్ సహా ఆయన తల్లి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రతిభా సింగ్‌పై నిప్పులు చెరిగారు. రాజకీయాల్లో పోటీ ఉండాలని, కానీ అవి హద్దులు దాటకూడదని వ్యాఖ్యానించారు.

"విక్రమాదిత్య సింగ్ ఓటమిని భరించలేకపోతున్నారు. మండీ మాజీ ఎంపీ ప్రతిభా సింగ్, ఆమె కుటుంబం ఈ ప్రాంతాన్ని 40 ఏళ్లుగా పాలించారు. కానీ, ఎంపీ నిధుల్లో ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. లోక్‌సభలో ఈ ప్రాంత ప్రజల పక్షాన ఒక్కసారి కూడా వారు గళాన్ని విప్పలేదు" అని కంగన ఆరోపించారు.

మండీ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి తనకో విజన్ ఉందని చెప్పిన కంగన... సువిశాల, విభిన్న భౌగోళిక స్వరూపం కలిగినప్పటికీ ప్రకృతి వైపరీత్యాలతో సవాళ్లు ఉన్నాయన్నాని వెల్లడించారు. రైల్వేలు, విద్యుత్, కమ్యూనికేషన్‌తోపాటు భార్మౌర్, పాంగీ వంటి మారుమూల ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు లేవన్నారు. సొరంగాలు, రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎప్పటి నుంచో డిమాండ్లు ఉన్నాయని, ఈ అంశాలను తాను లోక్‌సభలో లేవనెత్తుతున్నానని కంగనా చెప్పారు.

ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్.. రామ్‌పూర్ రాజకుటుంబ వారసుడు. గత లోక్‌సభ ఎన్నికల్లో మండీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. ఆయనపై కంగనా రనౌత్ విజయం సాధించి తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ క్రమంలో ఆమెపై విక్రమాదిత్య ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. మండీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ.. నియోజకవర్గంలో ఆమె కనిపించడం లేదన్నారు. ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి కేవలం రెండుసార్లే నియోజకవర్గంలో చూశానని, ఓసారి ప్రైవేటు రెస్టరంట్ ఓపెనింగ్ సమయంలో, మరోసారి ఓ కార్యక్రమంలో మాత్రమే చూశానని చెప్పారు. ఆ కామెంట్లకే కంగన ఇప్పుడు సమాధానమిచ్చారు.

# అరుదైన వ్యాధి ఔషధాన్ని దేశంలో
# తక్కువ ధరకే అందించగలరా?

**వెన్నెముకలో కండరాలను క్రమంగా బలహీనపరచి, కదలికలతో పాటు శ్వాస ప్రక్రియకు ఇబ్బంది కలిగించే జన్యుపరమైన రుగ్మత (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి-ఎస్ఎంఏ) నివారణ ఔషధాన్ని తక్కువ ధరకే మన దేశంలో అందుబాటులో ఉంచే విషయమై సుప్రీంకోర్టు కీలక ప్రశ్న సంధించింది.**

**రిస్‌డిప్లామ్ ఉత్పత్తిదారును ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

**ఈ కబురు,దిల్లీ:**

వెన్నెముకలో కండరాలను క్రమంగా బలహీనపరచి, కదలికలతో పాటు శ్వాస ప్రక్రియకు ఇబ్బంది కలిగించే జన్యుపరమైన రుగ్మత (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫిఎస్ఎంఏ) నివారణ ఔషధాన్ని తక్కువ ధరకే మన దేశంలో అందుబాటులో ఉంచే విషయమై సుప్రీంకోర్టు కీలక ప్రశ్న సంధించింది. పొరుగు దేశాలైన పాకిస్థాన్, చైనాలకు చౌక ధరకే సరఫరా చేయగలుగుతున్నప్పుడు భారత్‌లోనూ తక్కువ ధరకే ఔషధాన్ని అందుబాటులో ఉంచగలరా అని ఆరా తీసింది. ఈ విషయమై సమాధానం ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం...'రిస్‌డిప్లామ్' ఔషధ తయారీ సంస్థ 'హాఫ్‌మన్ లా రోష్'ను ఆదేశించింది. ఎస్ఎంఏ (గ్రూప్3) బాధితురాలు 24ఏళ్ల మహిళ తరఫున దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. పాకిస్థాన్, చైనా ప్రభుత్వాల జోక్యంతో తక్కువ ధరకే ఆ దేశాల్లో ఈ ఔషధాన్ని సంస్థ సరఫరా చేస్తోందని పిటిషనర్ తరఫు న్యాయవాది ఆనంద్ గ్రోవర్...ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. భారత ప్రభుత్వం కూడా ఔషధ సంస్థతో చర్చలు జరపాలని సూచించారు. జన్యుపరమైన రుగ్మతతో బాధపడుతున్న వారు మన దేశంలోనూ అధికంగా ఉన్నారనే విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది. సెబా (24) అనే మహిళకు ఎస్ఎంఏ వ్యాధి చికిత్సకు గాను రూ. 18లక్షల విలువైన ఔషధాలను అందించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన కేరళ హైకోర్టు ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 24న స్టే విధించింది. ఈ నిలుపుదల ఉత్తర్వులు తదుపరి విచారణ తేదీ వరకు కొనసాగుతాయని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా పేర్కొంది. ఇతర మార్గాల ద్వారా ఆర్థిక సహాయాన్ని పొందాలని, ధర తగ్గించాలనే అభ్యర్థనను ఔషధ తయారీ సంస్థకు పంపించాలని ధర్మాసనం సూచించింది.

# ఇప్పుడు ముస్లింలు.. తర్వాత ఇతరులు

**ముస్లింల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇది ఇంతటితో ఆగదని, భవిష్యత్తులో ఇతర వర్గాల లక్ష్యంగానూ ఇటువంటి బిల్లులు వస్తాయంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.**

**ఆరెస్సెస్ లక్ష్యం అదే: రాహుల్**
**నూలు దుస్తుల విక్రయ దుకాణంలో రాహుల్**

**ఈ కబురు, దిల్లీ:** ముస్లింల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇది ఇంతటితో ఆగదని, భవిష్యత్తులో ఇతర వర్గాల లక్ష్యంగానూ ఇటువంటి బిల్లులు వస్తాయంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. తన పోస్టుకు ఒక వ్యాసాన్నీ రాహుల్ జత చేశారు. వక్ఫ్ బిల్లును తీసుకొచ్చిన తర్వాత ఆరెస్సెస్ దృష్టి ఇప్పుడు కాథలిక్ చర్చి ఆస్తుల వైపు మళ్లిందని ఆ వ్యాసం పేర్కొంది. క్రిస్టియన్ల వైపు తన దృష్టిని మరలించటానికి ఆరెస్సెస్ ఎంతో సమయం తీసుకోకపోవచ్చంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడుల నుంచి రాజ్యాంగం మాత్రమే రక్షించగలదని, కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని పేర్కొన్నారు.

**సరైన మౌలిక వసతులు ఉంటే వస్త్ర పరిశ్రమలో మనదే అగ్రస్థానం**

పత్తి విత్తనాలు, నూలు, వస్త్ర సాంకేతికతలకు విదేశీ కంపెనీలపై ఆధారపడాల్సి రావడం, ఈ పరిశ్రమలోని కార్మికులకు అతి తక్కువ వేతనాలు, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటివి మన దేశ జౌళి రంగ దుస్థితిని తెలియజేస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. నూలు దుస్తుల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులను ఇటీవల ఆయన కలుసుకున్నారు. ఈ విశేషాలను సామాజిక మాధ్యమం ద్వారా తెలియజేశారు. జౌళి ఎగుమతుల్లో చైనా కన్నా 10 రెట్లు వెనుకబడి ఉన్నామని తెలిపారు. మన దేశంలో ప్రతి 100 కిలోమీటర్లకు వైవిధ్యమైన వస్త్ర సంప్రదాయం కనిపిస్తుందన్నారు. దేశీయ పత్తి రకాలను ప్రోత్సహించడంతో పాటు వస్త్ర పరిశ్రమకు సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఈ రంగంలో మన దేశం మరోసారి అగ్రస్థానానికి చేరుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సరఫరా వ్యవస్థలనూ మెరుగుపరచాల్సి ఉందన్నారు.



# భవన నిర్మాణ కార్మిక సంఘం
# మహాసభలను జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**ఈ-కబురు, రంగారెడ్డి :**

తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్,కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ తలకోండపల్లి మండల మహసభను ఆదివారం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నరసింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఉత్పత్తిలో కీలకమైన కార్మికులకు సంపదను పంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. దేశ నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర కార్మికులదేనని,అయినా పాలక ప్రభుత్వాలు కార్మికుల కోసం ఉన్న చట్టాలను అమలు చేయకుండా నిర్వీరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించుకునేందుకు కార్మిక సోదరులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో జరగనున్న 4వ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. అనంతరం తలకోండపల్లి మండల సిపిఐ పార్టీ నిర్మాణ బాధ్యులు సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షునిగా జె.చందు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీను, దీప్లా నాయక్, బాలయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీరామ్, వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, రంగారెడ్డి జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు నరసింహ, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శక్రు నాయక్, మండల కార్మికులు శ్రీశైలం, మల్లేష్, సిహెచ్.యాదయ్య, వెంకటయ్య, రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుకలు.. పట్టు వస్త్రాలు
# సమర్పించిన సిఎం రేవంత్ రెడ్డి

**భద్రాచలం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. పవిత్రమైన గోదావరి నది తీరంలో స్థితిచేసిన భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రాముల కల్యాణాన్ని దర్శించుకోవడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి అనేక మంది భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా రామ నామ స్మరణతో మార్మోగుతోంది. ఈ శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవాలు గత నెల 30వ తేదీ నుండి ప్రారంభమై ఏప్రిల్ 12 వరకు కొనసాగనున్నాయి.**





తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సతీ సమేతంగా విచ్చేసి.. స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించి, కల్యాణోత్సవాన్ని దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఇప్పటికే ఆలయం వద్దకు చేరుకుని శ్రీరామచంద్రుని దర్శనం చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**కళ్యాణ పూజ ఆధ్యాత్మికత**

ఉదయం 10:30 గంటలకు మిథిలా మండపంలో కళ్యాణ పూజలు ప్రారంభమయ్యాయి. ఇవి మధ్యాహ్నం 12:30 వరకు సాగుతాయి. వేద మంత్రోచ్ఛారణతో పూజలు జరుగుతుండగా, అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని శ్రీ సీతారాముల శిరస్సుపై ఉంచుతారు. ఇది శుభ ముహూర్తం మరియు జగత్తు కల్యాణానికి శుభ సంకేతం.పూజల అనంతరం తలంబ్రాల వేడుక జరుగుతుంది, ఇందులో బ్రహ్మ బంధనం వేయడం జరుగుతుంది. దీనిని బ్రహ్మముడి అంటారు. ఆపై చతుర్వేదాల సహాయంతో నూతన దంపతులకు ఆశీర్వాదాలు ఇవ్వబడతాయి. సాధారణంగా కల్యాణంలో రెండు సూత్రాలు ఉంటాయి, కానీ భద్రాచలం కల్యాణంలో భక్త రామదాసు ఎంతో ప్రేమతో తయారు చేసిన పతకాన్ని కలిపి మూడు సూత్రాలను సీతమ్మవారికి ధరింపజేస్తారు.

**సీతమ్మ తల్లికి ప్రత్యేక బంగారు చీర**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి పొందిన భద్రాచలం శ్రీ సీతారాముల ఆలయంలో కల్యాణ వేడుకలు అద్భుతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీరామనవమి వేడుకల కోసం సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్.. సీతమ్మ తల్లికి బంగారు పట్టు చీరను నేసి సమర్పించారు. ఈ చీర సీతమ్మ తల్లి గోల్డెన్ పట్టు చీరగా ప్రసిద్ధి చెందింది.

వెల్ది హరిప్రసాద్ చేనేత కళారంగంలో విశేష ప్రతిభ కలిగిన వ్యక్తి. ప్రతి ఏడాది శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం కల్యాణానికి ప్రత్యేకమైన చీరను అందిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా ఆయన సీతమ్మ తల్లికి అందించే బంగారు పట్టు చీర నేయడానికి ప్రత్యేక శ్రద్ధ చూపించారు.



బిజెపి జెండాను ఎగురవేస్తున్న రాధాకృష్ణ యాదవ్

## ప్రధాని మోడీ సారథ్యంలో అఖండ భారతం వైపు అడుగులు : గంగల రాధాకృష్ణ యాదవ్

**మాదాపూర్ లో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో అఖండ భారతం వైపు విజయ యాత్ర సాగుతుందని మాదాపూర్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ డివిజన్ లో ఘనంగా నిర్వహించారు. మాదాపూర్ లోని చందా నాయక్ తండాలో సుమన్ నాయక్, శ్రీనివాస్ నాయక్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు గంగల రాధాకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై బిజెపి జెండాను ఎగురవేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ నవభారత నిర్మాత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. నేడు దేశ ప్రజలు బిజెపి పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ యాదవ్, బాలు నాయక్, గురు యాదవ్, నరేష్ రెడ్డి, ఈశ్వర్, చింటూ, శివ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ


శ్రీరామనవమి వేడుకల ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే గాంధీ

## సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు అన్న సమారాధన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శ్రీ రామచంద్ర ప్రభువు జీవితం అనుచరనీయమని, రాజ్యపాలన, తల్లిదండ్రులపై ప్రేమ, సోదర వాత్సల్యం ఆయన జీవితంలో కనిపిస్తాయని అన్నారు. ధర్మ పాలనతో లోకానికి ఆదర్శంగా నిలిచి జగదభిరాముడుగా వెలుగొందాడని అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తన అదృష్టమని, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని రామచంద్ర ప్రభువుని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, వేడుకల నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి గోపనపల్లి దేవాలయం పూజలో పాల్గొన్న గంగాధర్ రెడ్డి


కార్యకర్తలతో కలిసి భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్న కార్పొరేటర

# శ్రీరాముడు చూపించిన ధర్మ మార్గంలో నడవాలి

## కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

- గచ్చిబౌలి డివిజన్ లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శ్రీరామచంద్ర ప్రభువు చూపించిన ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, శ్రీరాముడి జీవితం ఆచరణీయమని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గచ్చిబౌలి పరిధిలోని నల్లగండ్లలో గల అపర్ణ సైబర్ జోన్, అపర్ణ సరోవర్ జెనిత్, నవోదయ కాలని, మంజీర డైమండ్ హిట్స్, గోపనపల్లి తండా, గోపనపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రజలందరికీ శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ఆవిర్భవించిన అవతారమే శ్రీరామ అవతారం అని అన్నారు. శ్రీరాముడి దయతో ప్రజలంతా సుఖ, సంతోషాలతో జీవించాలన్నారు. శ్రీరామనవమి ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# కంచె గచ్చిబౌలి వివాదంపై మీనాక్షి నటరాజన్ ఫోకస్

- సెంట్రల్ యూనివర్సిటీ వర్గాలతో సమావేశం
- డిమాండ్లను మీనాక్షి ముందు పెట్టిన విద్యార్థులు, ఉద్యోగులు


విద్యార్థులతో కలిసి గచ్చిబౌలి స్టేడియంలో కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్


కంచె గచ్చిబౌలి భూముల పరిశీలనకు వెళ్లేందుకు ప్రయత్నించిన మీనాక్షిని అడ్డుకున్న పోలీసులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచె గచ్చిబౌలి భూముల వివాదంపై కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోకస్ పెట్టారు. కంచె గచ్చిబౌలి భూముల వేలాన్ని, ప్రభుత్వం చేపట్టిన చెట్ల కూల్చివేతను నిరసిస్తూ విద్యార్థులు చేసిన ఉద్యమం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 400 ఎకరాల భూమిలో చెట్ల తొలగింపు పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ విషయమై దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులు, ప్రముఖులు స్పందించడం. సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించి స్టే విధించిన విషయం తెలిసిందే. దీంతో నష్ట నివారణ చర్యలకు దిగిన కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయమై వెంటనే రంగంలోకి దిగిన మీనాక్షి నటరాజన్ ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన వివిధ వర్గాలతో సమావేశమయ్యారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో గల స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, పలు విద్యార్థి సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మీనాక్షి నటరాజన్ తాను కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా సమావేశానికి హాజరయ్యానని,

యూనివర్సిటీ వర్గాల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. దీనిపై స్పందించిన వర్సిటీ వర్గాలు తమ డిమాండ్లను మీనాక్షి నటరాజన్ ముందు ఉంచారు. సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ లో మోహరించిన పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. విద్యార్థుల మీద పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వివాదస్పదంగా మారిన 400 ఎకరాలను కలుపుకొని మొత్తం వర్సిటీకి చెందిన 2,300 ఎకరాల భూమిని వెంటనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. యూనివర్సిటీని ఇక్కడి నుంచి తరలించి. ఎకో పార్కు ఏర్పాటు చేయాలనే వదంతులు వినిపిస్తున్నాయని, ప్రభుత్వం వేలం వేయాలని చూస్తున్న 400 ఎకరాల్లో ఇప్పటికే వర్సిటీకి చెందిన మూడు డిపార్టుమెంట్లు ఉన్నాయని, సదరు భూమి పూర్తిగా యూనివర్సిటీకి చెందినదేనని తేల్చిచెప్పారు. యూనివర్సిటీ వర్గాల డిమాండ్లను విన్న మీనాక్షి నటరాజన్ ప్రభుత్వం దృష్టికి డిమాండ్లను తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు ప్రజా సంఘాల ప్రతినిధులతో సైతం మీనాక్షి నటరాజన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రతినిధులతో కలిసి కంచె గచ్చిబౌలి భూముల పరిశీలనకు వెళ్లేందుకు మీనాక్షి నటరాజన్ ప్రయత్నించగా, అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వం ఇటువంటి ఆలోచనను విరమించుకోవాలని హెచ్చరించారు. వర్సిటీ భూమిని కలుపుకొని మొత్తం ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, వర్సిటీలో ఉన్న పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ స్థలం అంటే ప్రజల ఆస్తి అని, యూనివర్సిటీకి కేటాయించిన ప్రభుత్వ భూమిని విద్యా కార్యకలాపాలకే ఉపయోగించాలని అన్నారు. యూనివర్సిటీకి కేటాయించిన నాటి నుంచి సదరు భూముల్లో పచ్చదనం పెంచేందుకు వర్సిటీ వర్గాలు తీవ్రంగా శ్రమించాయని, వర్సిటీ ఆవరణలో 734 రకాల చెట్లు, 220 రకాల పక్షి జాతులు, 15 రకాల జంతువులు, చెరువుల నిలయమన్నారు. ప్రభుత్వం 400 ఎకరాలను వేలం వేసి భవనాలు నిర్మిస్తే వరద నీటి ప్రవాహం అడ్డుపడి, పర్యావరణం దెబ్బతింటుందన్నారు.**

# కొండాపూర్ లో నడిరోడ్డుపై దారుణం...

- గర్భవతిగా ఉన్న భార్య మీద భర్త కర్కశత్వం
- బండరాయితో మోది భార్యపై హత్యాయత్నం
- ప్రాణాలతో పోరాడుతున్న గృహిణి




భార్య పర్వీన్ మీద రాయితో దాడి చేస్తున్న భర్త బస్రత్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
గర్భవతిగా ఉన్న భార్యను ఆసుపత్రికి తీసుకువచ్చిన ఓ కర్కశ భర్త బండరాయితో మోదీ హత్య చేసేందుకు యత్నించాడు. నడిరోడ్డు మీద భార్యపై దాడి చేసి దాదాపు పది నుంచి పదిహేను సార్లు బండరాయితో మోదడంతో తీవ్ర గాయాలపాలైన మహిళ చావు బ్రతుకుల మధ్య ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మీద క్రూరంగా దాడి చేసిన నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... వికారాబాద్ కు చెందిన ఎండి. బస్రత్ (32) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కుటుంబంతో కలిసి హఫీజ్ పేట్ పరిధిలోని ఆదిత్యనగర్ లో నివాసం ఉంటున్నాడు. కాగా 2023 జనవరిలో అజ్మీర్ దర్గాకు బస్రత్ కు కోల్ కత్తా కు చెందిన షబానా పర్వీన్(22) పరిచయం అయ్యింది. వీరి పరిచయం ప్రేమగా మారగా, 2024 అక్టోబరులో వీరు పెళ్లి చేసుకున్నారు. పెళ్లి అనంతరం ఇద్దరు హఫీజ్ పేట్ ఆదిత్య నగర్ లో కాపురం పెట్టగా, బస్రత్ ఇంటీరియర్ డిజైన్ పనులు చేస్తున్నాడు. పెళ్లి అనంతరం మొదట అత్తా, మామలతో కలిసి ఉండగా, కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. దీంతో బస్రత్, షబానా పర్వీన్ లు స్థానికంగా వేరు కాపురం పెట్టారు. ప్రస్తుతం షబానా పర్వీన్ రెండు నెలల గర్భిణి కాగా, మార్చి 29వ తేదీన పర్వీన్ కు వాంతులు కావడంతో కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని సియా లైఫ్ ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజులు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న తరువాత పర్వీన్ ను ఏప్రిల్ 1వ తేదీన రాత్రి డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రి బయటకు రావడంతోనే, హాస్పిటల్ ముందే భార్య, భర్తలకు గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరుగడంతో బస్రత్ ఒక్కసారిగా తన భార్య పర్వీన్ మీద దాడికి తెగబడ్డాడు. నడిరోడ్డు మీద పెనుగులాటలో కిందపడిన భార్య మీద అక్కడే ఉన్న బండరాయితో దాడి చేశాడు. దాదాపు 10 నుంచి 12సార్లు రాయితో మోదడంతో పర్వీన్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లింది. చనిపోయిందని భావించిన బస్రత్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు కొన ఊపిరితో ఉన్న పర్వీన్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా పర్వీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మియాపూర్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కోమాలో ఉన్న పర్వీన్ ప్రాణాలతో పోరాడుతుంది. పర్వీన్ కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడు బస్రత్ ను ఈనెల 3వ తేదీన అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



## నిద్రపుచ్చే రోబో..
# దీని రేటెంతో తెలుసా?

**కంటి నిండా నిద్రపోతే కలిగే మేలు ఎంతో, కలత నిద్రతో జరిగే కీడు కూడా అంతే! తాజాగా నిద్రలేమి సమస్యతో గుండెజబ్బులు వస్తున్నాయని తేలింది. మిమ్మల్ని హాయిగా నిద్రపోయేలా చేసే స్మార్ట్ టెక్నాలజీతో రూపొందించిన గాడ్జెట్స్ గురించి తెలుసుకుందాం.**

**నిద్రపుచ్చే రోబో**
అమ్మలా మిమ్మల్ని జోకొట్టి, పాటలు పాడి, కథలు చెప్పే రోబోలు చాలానే వచ్చేశాయి. అలాంటి వాటిలో ఒకటే ఈ 'సోమ్నాక్స్ స్లీప్ రోబో'. ఇది మిమ్మల్ని నిద్రపోయే ముందు విశ్రాంతి తీసుకోవడానికి బాగా సహాయపడుతుంది.

సంగీతం, కథలను వినిపిస్తూ నిద్ర పుచ్చుతుంది. మెత్తగా, వెచ్చగా ఉండే వీటిని పక్కనే పట్టుకొని నిద్రపోతే ఎటువంటి భయం లేకుండా చాలా ధైర్యంగా ఉంటుంది. ఇక ఇందులో వివిధ ప్రకృతి శబ్దాలు, ఆహ్లాదకరమైన సంగీతంతో పాటు శ్వాస వ్యాయామాలు, ధ్యానం చేసేలా వాల్యూమ్ నియంత్రణలు, నైట్‌లైట్ ఎంపికలు వంటి ఆప్షన్లు ఉన్నాయి. ధర రూ.46,976.




## రూ.1400 కోట్ల డీల్..
# డెల్హివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్

**ముంబై:** లాజిస్టిక్స్ సర్వీసు ప్రొవైడర్ డెల్హివరీ వ్యాపార విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు సుమారు రూ.1400 కోట్లు వెచ్చించనుంది. పూర్తి నగదు రూపంలోనే చెల్లింపు చేసేలా ఒప్పందం ఖరారు చేసుకుంది. ''ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాము. 99.4 శాతం వాటాను రూ.1407 కోట్లకు కొనుగోలు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది'' అని డెల్హివరీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.

గురుగ్రామ్‌కు చెందిన ఈకామర్స్ ఎక్స్‌ప్రెస్ 2012 ఆగస్టులో ప్రారంభమైంది. అప్పటి నుంచి 200 కోట్ల షిప్‌మెంట్లు డెలివరీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,607.3 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.2,548.1 కోట్లుగా ఉంది. విలీన ప్రక్రియకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలపాల్సి ఉంది.

ఈ డీల్ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని డెల్హివరీ అంచనా వేస్తోంది. ఈ విలీనంతో కస్టమర్లకు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశం లభిస్తుందని కంపెనీ ఎండీ, సీఈఓ సాహిల్ బారువా తెలిపారు. డెల్హివరీతో భాగస్వామ్యం వల్ల మరింత వృద్ధి చెందేందుకు అవకాశం లభిస్తుందని ఈకామ్ ఎక్స్‌ప్రెస్ వ్యవస్థాపకులు కే సత్యనారాయణ పేర్కొన్నారు.




## ఈపీఎఫ్ఓ ప్యానెల్‌లో
# మరో 15 బ్యాంకులు

**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధికి సంబంధించిన చెల్లింపులను స్వీకరించేందుకు కొత్తగా మరో 15 బ్యాంకులను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) తమ ప్యానెల్‌లో చేర్చింది. దీంతో మొత్తం బ్యాంకుల నెట్‌వర్క్ 32కి పెరిగింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమక్షంలో ఈపీఎఫ్‌వో, ప్రభుత్వ.. ప్రైవేట్ రంగ బ్యాంకులు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఫెడరల్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ మొదలైనవి కొత్తగా ప్యానెల్‌లో చేరిన వాటిలో ఉన్నాయి.

78 లక్షల పైచిలుకు పింఛనుదారులు ఏ బ్యాంకు ఖాతా నుంచైనా పింఛన్లను పొందేందుకు కూడా ఇది తోడ్పడుతుందని మంత్రి చెప్పారు. నవ భారత లక్ష్యం దిశగా దేశ పురోగతికి ఈపీఎఫ్ఓలాంటి సంస్థలు దోహదపడుతున్నాయని తెలిపారు. 8 కోట్ల మంది పైగా యాక్టివ్ సభ్యులు, 78 లక్షల మందికి పైగా పెన్షనర్లకు .. సంస్థ సామాజిక భద్రత ప్రయోజనాలను కలిపిస్తోందని ఆయన చెప్పారు. 2024-25లో 6 కోట్ల పైగా క్లెయిమ్‌లను సెటిల్ చేసిందని తెలిపారు. 2023-24లో నమోదైన 4.45 కోట్లతో పోలిస్తే ఇది 35 శాతం అధికమని మాండవీయ వివరించారు.

## ఫిన్‌టెక్ సంస్థలకు
# పెట్టుబడుల జోష్..

- 2025లో 550 మిలియన్ డాలర్ల సమీకరణ
- భారీగా ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్స్
- లిస్టులో ఎపిస్, యాక్సెల్ తదితర సంస్థలు




**ముంబై:** దాదాపు రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఫిన్‌టెక్ రంగంలోకి పెట్టుబడులు మళ్లీ పుంజుకుంటున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. వెంచర్ ఇంటెలిజెన్స్ డేటా ప్రకారం 2025లో ఇప్పటివరకు వృద్ధి దశలో ఉన్న అంకుర సంస్థలు దాదాపు 550 మిలియన్ డాలర్లు సమీకరించాయి. మరికొన్ని డీల్స్ ముగింపు దశలో ఉన్నాయి.

పీక్ ఫిఫ్టీన్ పార్ట్‌నర్స్, ఎపిస్, యాక్సెల్, మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్, ఎస్ఎంబీసీ గ్రూప్ లాంటి భారీ ఫండ్స్, ఫిన్‌టెక్‌లో భాగమైన వివిధ విభాగాల్లోని సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. నియంత్రణ నిబంధనలపరమైన అనిశ్చితి తగ్గడంతో రాబోయే రోజుల్లో ఫిన్‌టెక్ రంగంలో మరిన్ని డీల్స్ నమోదవుతాయని వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ వర్గాలు తెలిపాయి. ఫిన్‌టెక్ రంగంలోకి 2023, 2024లో కేవలం 1.3 బిలియన్ డాలర్లు మాత్రమే రాగా.. తాజాగా ఈ ఏడాది తొలి నాళ్లలోనే అర బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు రావడం సానుకూల పరిస్థితులను సూచిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వివరించాయి.

**వెల్త్‌టెక్‌కు ప్రాధాన్యం..**
ఫండ్స్ పెట్టుబడుల్లో వెల్త్‌టెక్ విభాగానికి ఎక్కువగా ప్రాధాన్యం లభిస్తున్నప్పటికీ, పేమెంట్స్, బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లాంటి ఇతరత్రా విభాగాలకు కూడా గత మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో గ్రోత్ స్టేజ్ పెట్టుబడులు మెరుగ్గానే లభిస్తున్నాయి. బెంగళూరుకు చెందిన క్యాష్‌ఫ్రీ సంస్థ ఫిబ్రవరిలో 43 మిలియన్ డాలర్లు సమకూర్చుకుంది. అలాగే, టోన్‌ట్యాగ్ అనే సౌండ్ ఆధారిత పేమెంట్స్ స్టార్టప్ 78 మిలియన్ డాలర్లు అందుకుంది.

ఇక ఈజ్‌బజ్ అనే పేమెంట్ అగ్రిగేటర్ సంస్థలో బెస్సీమర్ వెంచర్ పార్ట్‌నర్స్ సారథ్యంలో ఇన్వెస్టర్లు 40 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టారు. టోన్‌ట్యాగ్‌కు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ దన్ను ఉంది. ఈ విభాగంలో వృద్ధి చాలా నెమ్మదిగా ఉండొచ్చు కానీ తాజా పరిణామాలతో వ్యాపారాలకు కాస్త స్థిరత్వం లభిస్తుందని ఓ వెంచర్ క్యాపిటల్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

**మరోవైపు, ఫిన్‌టెక్ రంగంలో అంతర్గతంగా వెల్త్‌టెక్ విభాగం విస్తరణకు గణనీయంగా అవకాశాలు కనిపిస్తున్నాయి. కోటక్ చెర్రీ సీఈవో శ్రీకాంత్ సుబ్రమణియన్, ఐఐఎఫ్ఎల్ వెల్త్‌కి చెందిన సందీప్ జెత్వానీ వంటి ప్రముఖ వెల్త్ మేనేజర్ల సారథ్యంలోని సంస్థలపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. పేటీఎం మనీ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్ జాదవ్ నెలకొల్పిన ధన్ సుమారు 1.1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో దాదాపు 200 మిలియన్ డాలర్లు సమీకరించే యత్నాల్లో ఉంది.**

**2022లో ప్రారంభమైన స్టేబుల్ మనీ సంస్థ 130 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో 20 మిలియన్ డాలర్లు సమకూర్చుకుంటోంది. 2024 జూన్‌లో నిధులు సమీకరించినప్పటితో పోలిస్తే వేల్యుయేషన్ మూడు రెట్లు పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ నుంచి నియంత్రణ నిబంధనల విషయంలో స్పష్టత నెలకొనడమే ఈ విభాగంపై వెంచర్ క్యాపిటల్ సంస్థలకు ఆసక్తి పెరగడానికి కారణమని పలువురు ఇన్వెస్టర్లు వెల్లడించారు.**

# వినియోగదారుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

**నియంత్రణలను మెరుగ్గా మారుస్తాం**
**రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటన**

**ముంబై:** నియంత్రణ కార్యాచరణను మరింత మెరుగ్గా మార్చడం ద్వారా వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఆర్థిక స్థిరత్వం, సామర్థ్యాలను సమతుల్యం చేయ డం ద్వారా దీన్ని సాధిస్తామన్నారు. ఆర్‌బీఐ 90వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. ఆరంభం నుంచి చూస్తే ఆర్‌బీఐ పాత్ర ఎంతో విస్తృతమైనట్టు చెప్పారు.

''సంప్రదాయం-మార్పునకు మధ్య మనం నిలబడి ఉన్నాం. ధరల స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక వృద్ధి అన్నవి అత్యాధునిక టెక్నాలజీలు, అంతర్జాతీయ అనిశ్చితులు, వాతావరణ మార్పుల సవాళ్లు, పెరుగుతున్న ప్రజల అంచనాలు వేగవంతమైన సాంకేతిక పురోగతితో అనుసంధానమై ఉన్నాయి'' అని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.



**భారత ఆర్థిక వ్యవస్థ ఆర్థిక నిర్మాణాన్ని తీర్చిదిద్దడంలో వచ్చే దశాబ్ద కాలం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మరింత మందికి ఆర్థిక సేవలను చేరువ చేసేందుకు ఆర్‌బీఐ కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. "కస్టమర్ల సేవలు, వినియోగదారుల పరిరక్షణ స్థిరంగా మెరుగుపడే సంస్కృతిని రెపొందించడానికి కృషి చేస్తాం. టెక్నాలజీ ఆవిష్కరణలకు మా మద్దతు కొనసాగుతుంది"అని ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం సహా భాగస్వాములు అందరి సహకారాన్ని తీసుకుంటామని ఆర్‌బీఐ గవర్నర్ చెప్పారు.**

## ముగ్గురు ఖాన్‌లనూ
# మించిన కుబేరుడు!

**ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 ఎడిషన్ ఇటీవల విడుదలైంది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన బిలియనీర్లు 205 మంది ఉన్నారు. వీరిలో వినోదం, మీడియా ప్రపంచానికి చెందినవారు కొంతమంది ఉండగా ఇందులో బాలీవుడ్ నుంచి ఉన్న ఏకైక బిలియనీర్ రోనీ స్క్రూవాలా . ఒకప్పుడు టూత్ బ్రష్‌లు అమ్మిన ఆయన ఇప్పుడు పరిశ్రమలోని అతిపెద్ద సూపర్ స్టార్ల కంటే ధనవంతుడైన పారిశ్రామికవేత్త.**



**బాలీవుడ్ అపర కుబేరుడు**
ఫోర్బ్స్ ప్రకారం.. హిందీ చిత్ర పరిశ్రమ నుండి ఒక బిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్న ఏకైక వ్యక్తి మూవీ మాగ్నెట్, పారిశ్రామికవేత్త రోనీ స్క్రూవాలా. ఫోర్బ్స్ కొత్త జాబితా ప్రకారం ఈ మీడియా మొఘల్ నికర విలువ 1.5 బిలియన్ డాలర్లు. దీంతో ఇండస్ట్రీలో సూపర్ స్టార్‌లుగా ఉన్న ఖాన్ త్రయం కంటే ధనవంతుడు. ఎలాగంటే షారుఖ్ ఖాన్ (770 మిలియన్ డాలర్లు), సల్మాన్ ఖాన్ (390 మిలియన్ డాలర్లు), అమీర్ ఖాన్ (220 మిలియన్ డాలర్లు) మొత్తం నెట్‌వర్త్ 1.38 బిలియన్ డాలర్లు కాగా ఆ ముగ్గురి సంపద కంటే రోనీ స్క్రూవాలా సంపద అధికం.

**రోనీ వ్యాపార ప్రస్థానం**
1956లో బొంబాయిలో జన్మించిన స్క్రూవాలా 70వ దశకం చివర్లో టూత్ బ్రష్ ల తయారీ ద్వారా తన వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించారు. 80వ దశకం ప్రారంభంలో ఆసియా క్రీడల పుణ్యమా అని కలర్ టీవీ దేశంలోకి ప్రవేశించినప్పుడు అ బూమ్‌ను స్క్రూవాలా అందిపుచ్చుకున్నారు. అలా ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి ప్రవేశించి 1990లో యూటీవీని స్థాపించారు. అదే తరువాత యూటీవీ మోషన్ పిక్చర్స్‌గా మారింది. తరువాతి రెండు దశాబ్దాలలో ఈ నిర్మాణ సంస్థలు స్వదేశ్, రంగ్ దే బసంతి, ఖోస్లా కా ఘోస్లా, జోధా అక్బర్, ఫ్యాషన్, ఢిల్లీ బెల్లీ, బర్ఫీమ్ వంటి ఐకానిక్ చిత్రాలను అందించాయి. అలాగే శాంతి, హిప్ హిప్ హుర్రే, షకా లకా బూమ్ బూమ్, కిచిడి, షరారత్ వంటి టీవీ షోలను అందించాయి.

**తర్వాత రోనీ స్క్రూవాలా 2012లో యూటీవీని డిస్నీకి బిలియన్ డాలర్ల ఒప్పందంలో అమ్మేశారు. అనంతరం ఐదు సంవత్సరాలకు ఆర్ఎస్‌వీపీ మూవీస్ సంస్థను స్థాపించారు. అలా ఎంటర్‌టైన్మెంట్ ప్రపంచంలోకి రీ ఎంట్రీ ఇచ్చిన ఆయన కేదార్‌నాథ్, ఉరీ, ది స్కై ఈజ్ పింక్, సామ్ బహదూర్ చిత్రాలను నిర్మించారు. 2024లో స్క్రూవాలా షార్క్ ట్యాంక్ ఇండియాలో షార్క్‌లలో ఒకరిగా వెండితెర అరంగేట్రం చేశారు. రోనీ స్క్రూవాలాకు సినిమాలే ఏకైక ఆదాయ వనరు కాదు. అప్ గ్రాడ్, యూనిలాజర్, యూఎస్ స్పోర్ట్స్ వంటి పలు స్టార్టప్ లలో ఇన్వెస్ట్ చేయడమే కాకుండా కొన్నింటిని స్థాపించారు. ఈ సంస్థల విజయం, తన సినిమా వ్యాపారం ఆయన భారీ సంపదను పోగుచేసుకోవడానికి దోహదపడ్డాయి.**



## క్రేజీ జంట.. కలిసే పార్టీ చేసుకున్నారా?

రష్మిక పేరు చెప్పగానే చాలామందికి గుర్తొచ్చేది విజయ్ దేవరకొండ. ఎందుకంటే వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని చాన్నాళ్లుగా టాక్. రష్మిక ఒకటి రెండుసార్లు పరోక్షంగా తన ప్రేమ గురించి బయటపెట్టింది గానీ విజయ్ పేరు మాత్రం చెప్పలేదు. మళ్లీ ఇప్పుడు వీళ్ల గురించి ఈ డిస్కషన్ ఎందుకంటే దానికి ఓ కారణముంది.

రష్మిక ఇప్పుడు పాన్ ఇండియా హీరోయిన్. వరస సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ కొట్టింది. తాజాగా తన పుట్టినరోజు సందర్భంగా ఒమన్ దేశానికి వెళ్లింది. అక్కడే బీచ్ ఒడ్డున సెలబ్రేషన్స్ చేసుకుంది. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోల్ని ఇన్ స్టాలో కూడా పోస్ట్ చేసింది.

కట్ చేస్తే విజయ్ దేవరకొండ.. బీచ్ ఒడ్డున తీసుకున్న కొన్ని ఫొటోల్ని ఇప్పుడు ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. ఇవి చూసిన కొందరు నెటిజన్లు.. రష్మికతో కలిసి విజయ్ బర్త్ డే పార్టీలో పాల్గొనే ఉంటాడుగా అని కామెంట్స్ చేస్తున్నారు. వీళ్లిద్దరూ జంటగా ఎప్పుడూ పోస్ట్ పెడతారా అని మాట్లాడుకుంటున్నారు.



### స్టార్ హీరోయిన్ పై దర్శకుడి

## కామెంట్స్.. ఫ్యాన్స్ ఆగ్రహం

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో శ్రద్ధా కపూర్ ఒకరు. గతేడాది స్త్రీ 2 మూవీతో ఇండస్ట్రీ హిట్ కొట్టింది. తాజాగా ఈ సినిమా డైరెక్టర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ శ్రద్ధా నవ్వుపై విచిత్రమైన కామెంట్స్ చేశాడు. దీంతో ఆమె అభిమానులు సదరు దర్శకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే?**

'స్త్రీ సినిమా తీయాలని అనుకున్నప్పుడు హీరోయిన్ ఎవరిని తీసుకుందామా అని చాలా ఆలోచించాం. ఆ టైంలో శ్రద్ధా కపూర్ పేరుని నిర్మాత దినేశ్ విజన్ ప్రతిపాదించారు. ఆమెనే ఎంపిక చేయడానికి గల కారణాన్ని కూడా నాతో చెప్పారు. ఓసారి దినేశ్, శ్రద్ధా విమానంలో వెళ్తున్నప్పుడు చాలాసేపు మాట్లాడుకున్నారట. ఆమె అచ్చం దెయ్యంలా నవ్వుతుందని, అందుకే ఈ మారుతీనగర్ సుబ్రమణ్యం హీరో లేటేస్ట్ మూవీ.. కన్నమ్మ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ యంగ్ హీరో అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర జంటగా నటిస్తోన్న తాజా చిత్రం బ్యూటీ. ఈ సినిమాకు భలే ఉన్నాడే ఫేమ్ జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్, వానరా సెల్యులాయిడ్, జీ స్టూడియోస్ బ్యానర్లపై అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కె ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి.

తాజాగా ఇవాళ శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి కన్నమ్మ అనే బ్యూటీఫుల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటను సనారే రాయగా.. ఆదిత్య ఆర్కే, లక్ష్మీ మేఘన ఆలపించారు. ఇక విజయ్ బుల్గానిన్ సంగీతం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ చిత్రంలో నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.

## అభిమానుల అత్యుత్సాహం.. హీరో పక్కనుండగానే

**సినిమా సెలబ్రిటీలు బయటకు నవ్వుతూ కనిపిస్తుంటారు. కానీ అప్పడప్పుడు అభిమానుల వల్ల ఇబ్బంది పడుతూనే ఉంటారు. మరీ ముఖ్యంగా హీరోయిన్లకు చేదు అనుభవాలు ఎదురవుతూ ఉంటాయి. తాజాగా అలాంటి పరిస్థితి శ్రీలీలకు ఎదురైంది. కొందరు అభిమానులు ఈమెని గట్టిగా పట్టి లాగేశారు.**

కొన్నాళ్ల ముందు వరకు వరస తెలుగు సినిమాలు చేసిన శ్రీలీల.. ప్రస్తుతం బాలీవుడ్ లో మూవీస్ చేస్తోంది. కార్తీక్ ఆర్యన్ తో ఓ ప్రేమకథలో నటిస్తోంది. నిన్నటివరకు డార్జిలింగ్ లో షూటింగ్ చేశారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కార్తిక్, శ్రీలీల నడిచి వస్తుండగా.. పక్కనే ఉన్న కొందరు శ్రీలీలని పట్టి లాగేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఈ వీడియో చూసిన శ్రీలీల ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. మరీ ఇలా ప్రవర్తిస్తున్నారేంట్రా అని అనుకుంటున్నారు. ఇకపోతే కార్తిక్ ఆర్యన్ తో శ్రీలీల డేటింగ్ అని కూడా కొన్నిరోజుల క్రితం రూమర్స్ వచ్చాయి. అయితే ఇవన్నీ మూవీపై బజ్ పెంచేందుకేనని కొందరు నెటిజన్లు అంటున్నారు.

## మారుతీనగర్ సుబ్రమణ్యం హీరో లేటేస్ట్ మూవీ.. కన్నమ్మ సాంగ్ రిలీజ్

**టాలీవుడ్ యంగ్ హీరో అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర జంటగా నటిస్తోన్న తాజా చిత్రం బ్యూటీ. ఈ సినిమాకు భలే ఉన్నాడే ఫేమ్ జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్, వానరా సెల్యులాయిడ్, జీ స్టూడియోస్ బ్యానర్లపై అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కె ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి.**

**తాజాగా ఇవాళ శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి కన్నమ్మ అనే బ్యూటీఫుల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటను సనారే రాయగా.. ఆదిత్య ఆర్కే, లక్ష్మీ మేఘన ఆలపించారు. ఇక విజయ్ బుల్గానిన్ సంగీతం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ చిత్రంలో నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.**










## కాబోయే భార్యతో అక్కినేని అఖిల్.. పెళ్లి కళ వచ్చేసిందా?

టాలీవుడ్‌లో అక్కినేని హీరో అఖిల్ ఏజెంట్ మూవీ తర్వాత ఎలాంటి ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేయలేదు. 2023లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఇటీవలే ఓటీటీలోకి వచ్చేసింది. బాక్సాఫీస్ వద్ద ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ రావడంతో ఓటీటీ రిలీజ్ కూడా ఆలస్యమైంది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించారు. అఖిల్ ప్రస్తుతం ఎలాంటి ప్రాజెక్ట్ ప్రకటించకపోవడంతో ఫ్యాన్స్ కాస్తా నిరాశకు గురవుతున్నారు. అయితే త్వరలోనే అఖిల్ బర్త్ డే సందర్భంగా కొత్త సినిమాను అనౌన్స్ చేయనున్నట్లు నిర్మాత నాగవంశీ ఇప్పటికే ట్విటర్ ద్వారా హింట్ ఇచ్చాడు.

ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. అఖిల్ త్వరలోనే వివాహబంధంలోకి అడుగు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తన ప్రియురాలు జైనాబ్ రావ్‌జీతో ఎంగేజ్‌మెంట్ కూడా చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలోనే పెళ్లి పీటలెక్కుతారని టాక్ వినిపించింది. కానీ అలా జరగలేదు. దీంతో మరోసారి టాలీవుడ్‌లో అఖిల్ పెళ్లి ఎప్పుడనే విషయంపై చర్చ మొదలైంది.

ఈ నేపథ్యంలో త్వరలోనే పెళ్లి చేసుకోబోయే అఖిల్, జైనాబ్ జంటగా కనిపించారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఒకరి చేయి ఒకరు పట్టుకుని సందడి చేశారు. ఇది చూసిన నెటిజన్స్.. చూడ ముచ్చటగా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే వీరి పెళ్లి పనులతో బిజీగా ఉన్నారేమో అంటూ పోస్టులు పెడుతున్నారు. వీరిద్దరు జంటగా వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరోసారి అఖిల్ పెళ్లిపై చర్చ మొదలైంది. అయితే ఈనెల 8న అఖిల్ పుట్టినరోజు కావడంతో సెలబ్రేట్ చేసుకునేందుకు వెళ్లారా? అని మరి కొందరు చర్చించుకుంటున్నారు.



## క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..
# ఆర్సీబీతో మ్యాచ్‌కు బుమ్రా సిద్ధం!

**జస్‌ప్రీత్ బుమ్రాను ఐపీఎల్ 18వ సీజన్‌లో చూసే అవకాశం త్వరలో రాబోతోంది.**

**ముంబయి ఇండియన్స్‌కు గుడ్ న్యూస్. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా జట్టుతో కలిశాడు. బౌలింగ్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సోమవారం (ఏప్రిల్ 7) ఆర్సీబీతో జరిగే మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని ముంబయి హెడ్ కోచ్ మహేల జయవర్ధెనె వెల్లడించాడు.'ఆర్సీబీతో మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడు. ఈ రోజు ట్రైనింగ్ సెషన్స్‌లో పాల్గొంటున్నాడు. శనివారం రాత్రి జట్టుతో కలిశాడు' అని జయవర్ధెనె పేర్కొన్నాడు.**

ఇప్పటివరకు నాలుగు మ్యాచులు ఆడిన ముంబయి కేవలం ఒక్క విజయం మాత్రమే సాధించింది. పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే మిగతా 10 మ్యాచుల్లో కనీసం 8 విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ముంబయి పేస్ బౌలింగ్‌ను కెప్టెన్ హార్దిక్ పాండ్యతోపాటు బౌల్ట్, దీపక్ చాహర్ నడిపిస్తున్నారు. కానీ, దీపక్ పెద్దగా ప్రభావం చూపించడం లేదు. పవర్‌ప్లేతోపాటు డెత్ ఓవర్లలో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టే బుమ్రా ఆర్సీబీతో మ్యాచ్‌లో ఆడితే ముంబయికి పెద్ద ప్లస్ అవుతుంది. మరి, అతడిని తుది జట్టులోకి తీసుకుంటారో లేదో చూడాలి.

ఆసీస్‌తో బోర్డర్ గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్ సందర్భంగా బుమ్రా గాయపడ్డ సంగతి తెలిసిందే. అప్పటి నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్నాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిపుణుల పర్యవేక్షణలో గాయం నుంచి కోలుకున్నాడు. నెట్స్‌లోనూ ప్రాక్టీస్ చేశాడు. తాజాగా ఐపీఎల్ 2025 సీజన్‌లో అడుగు పెట్టనున్నాడు.



# ఇషా సింగ్ రజత గురి

**సిఫ్ట్ కౌర్‌కు స్వర్ణం**
**మనూ భాకర్ విఫలం**
**ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్**

**బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో రజత పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా సింగ్ వెండి వెలుగులు విరజిమ్మింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఇషా సింగ్ 35 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా షూటర్లు సున్ యుజీ 28 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా... ఫెంగ్ జియాన్ 30 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది.**

ఇదే విభాగంలో పోటీపడిన భారత మరో షూటర్, 'డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్' మనూ భాకర్ 24 పాయింట్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మనూ భాకర్ 585 పాయింట్లు సాధించి మూడో స్థానంతో, ఇషా సింగ్ 579 పాయింట్లతో తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.

మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా పసిడి పతకం కైవసం చేసుకుంది. దీంతో సీజన్ ప్రారంభ ప్రపంచకప్ ఈవెంట్‌లో భారత్ ఖాతాలో తొలి పసిడి పతకం చేరింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్ 458.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

అనిట మంగోల్డ్ (జర్మనీ; 455.3 పాయింట్లు), అరినా అటుఖోవా (కజకిస్తాన్; 445.9 పాయింట్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో స్విఫ్ట్ కౌర్‌కు ఇదే తొలి పతకం మొత్తం 45 షాట్ల పాటు జరిగిన ఫైనల్లో తొలి 15 షాట్లు ముగిసిన అనంతరం జర్మనీ షూటర్ అనిట మంగోల్డ్ కంటే... 7.2 పాయింట్లు వెనుకబడిన సిఫ్ట్ కౌర్ ఆ తర్వాత అదరగొట్టింది.

నీలింగ్ పొజిషన్‌లో సరైన గురి పెట్టలేకపోయిన భారత షూటర్... ఆ తర్వాత ప్రోన్, స్టాండింగ్ పొజిషన్లలో సత్తాచాటింది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో సిఫ్ట్ కౌర్ 590 పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది.

## సన్‌రైజర్స్‌కు మరో పరాభవం..
# వరుసగా నాలుగో ఓటమి

**సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా నాలుగో ఓటమి చవి చూసింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.**

**హైదరాబాద్:** ఐపీఎల్ 18 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా నాలుగో ఓటమి చవి చూసింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులే చేయగలిగింది. ఈ మోస్తారు లక్ష్యాన్ని గుజరాత్ 16.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. శుభ్‌మన్‌గిల్ (61*; 43 బంతుల్లో 9 ఫోర్లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ (49; 29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. రూథర్‌ఫోర్డ్ (35*; 16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో మెరుపులు మెరిపించాడు. హైదరాబాద్ బౌలర్లలో షమి 2, కమిన్స్ ఒక వికెట్ తీశారు.





**అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ బ్యాటర్లలో ఒక్కరూ కూడా పెద్ద స్కోరు చేయలేదు. నితీశ్ కుమార్ రెడ్డి (31) టాప్ స్కోరర్. హెన్రిచ్ క్లాసెన్ (27), కమిన్స్ (22*), అభిషేక్ శర్మ (18), అనికేత్ వర్మ (18), ఇషాన్ కిషన్ (17) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ 4, ప్రసిద్ధ్ కృష్ణ 2, సాయి కిశోర్ 2 వికెట్లు పడగొట్టారు**

# 'ట్రావిషేక్' కాంబో దూకుడు తగ్గించదు: సన్‌రైజర్స్ కోచ్

**ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. గత రెండింట్లో ఒక గెలుపు, ఒక ఓటమిని చవిచూసిన సంగతి తెలిసిందే.**

**ఐపీఎల్ 2025 సీజన్ పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం సన్‌రైజర్స్ హైదరాబాద్‌దే. తొలి మ్యాచ్‌లో మినహా గత మూడింట్లో ఓడి హ్యాట్రిక్ సాధించిన ఎస్ఆర్‌హెచ్ ఇప్పుడు సొంతమైదానంలో గుజరాత్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. ఉప్పల్ వేదికగా ఇవాళ కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోతే మాత్రం ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం కావడం తథ్యం. అయితే, తమ దూకుడైన ఆటతీరును కొనసాగిస్తామని సన్‌రైజర్స్ సహాయక కోచ్ సైమన్ హెల్మోట్ వ్యాఖ్యానించాడు. గత మూడు మ్యాచుల్లో ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ విఫలమై నిరాశపరిచారు.**

"మా ప్రణాళికలు ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. హోం గ్రౌండ్‌లో మేం విజయవంతమయ్యాం. ఇక్కడ గత ఎనిమిది మ్యాచుల్లో ఆరింట్లో గెలిచాం. గత రెండింట్లో మాత్రం మాకు కలిసిరాలేదు. పాజిటివ్ బ్రాండ్‌తో క్రికెట్ ఆడతాం. మా ఆటపై మాకు నమ్మకం ఉంది. అద్భుతమైన సారథి ఉన్నాడు. తప్పకుండా జట్టును ముందుకు తీసుకెళ్తాడు. మైదానంలోకి దిగిన ప్రతి సారి ఒత్తిడి ఉండటం సహజం. గతంలో విజయం సాధించినా సరే దానిని పక్కన పెట్టేయాలి. ప్రస్తుతం మ్యాచ్‌పై దృష్టిపెట్టాలి. అభిషేక్, ట్రావిస్ హెడ్ అద్భుతమైన ఆటగాళ్లు. వారి దూకుడుకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. హైదరాబాద్‌లో మళ్లీ అడుగు పెట్టినప్పటి నుంచి మంచి శకునాలే ఉన్నట్లు అనిపిస్తోంది" అని సైమన్ వెల్లడించాడు.

వాతావరణం.. పిచ్ ఎలా ఉంటుందో?
హైదరాబాద్ పిచ్ ఎప్పుడూ బ్యాటింగ్‌కు అనుకూలమే. తొలి మ్యాచ్‌లోనే 286 పరుగులు కొట్టినా.. ఆ తర్వాత మాత్రం సన్‌రైజర్స్ ఆ స్థాయి ఆటను ప్రదర్శించలేదు. వాతావరణం కూడా పొడిగా ఉండటం.. ఈసారి పిచ్‌ను బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్‌పై భారీ స్కోరు చేసిన హైదరాబాద్.. ఆ తర్వాత జరిగిన రెండో పోరులో మాత్రం లఖ్‌నవూ బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయింది.





## ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు..
# క్లారిటీ ఇచ్చిన ధోనీ

**ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలొచ్చాయి. వాటిని ధోనీ తాజాగా ఖండించాడు.**

చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని శనివారం వార్తలొచ్చాయి. చెపాక్ వేదికగా దిల్లీ క్యాపిటల్స్, చెన్నై మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు ధోనీ తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకీదేవీ స్టేడియానికి వచ్చారు. సాధారణంగా వారు మ్యాచ్‌లు చూసేందుకు రారు. కానీ దిల్లీ మ్యాచ్‌కు రావడంతో మాహీ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కథనాలు పుట్టుకొచ్చాయి. మ్యాచ్ అనంతరం ధోనీ ఆ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ధోనీ.. తన రిటైర్మెంట్ వార్తలను ఖండించాడు. సీజన్ పూర్తయ్యేవరకు ఐపీఎల్‌కు వీడ్కోలు పలికే ఆలోచన లేదని పేర్కొన్నాడు.

ఇప్పటికిప్పుడు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించను. నేనింకా ఐపీఎల్‌లో ఆడుతున్నా. ఈ విషయంపై ఏడాదికి ఒకసారి సమీక్షించుకుంటా. ప్రస్తుతం నాకు 43 ఏళ్లు. జులైలో 44వ ఏటలోకి అడుగుపెడతా. ఇంకా ఆడాలా?వద్దా అని నిర్ణయించుకోవడానికి నాకు 10 నెలల సమయం ఉంది. నా రిటైర్మెంట్ ఎప్పుడు అని నిర్ణయించేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ప్రారంభానికి ముందు శరీరం సహకరిస్తోందనిపిస్తే ఆడతా. 'ఇక చాలు' అని అనిపించేంతవరకు ఇదే విధానాన్ని కొనసాగిస్తా





